రియల్ మాయ

- చీరాల్లో ఇష్టారాజ్యంగా అక్రమ లేఔట్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోని అధికారులు
- అనుమతుల గురించి అడిగేవారేరీ?



వాడరేవు రోడ్డులోని అట్టల ఫ్యాక్టరీ సమీపంలో 167-ఏ- రోడ్డు వద్ద వేసిన భారీ లే అవుట్

చీరాల: జిల్లాలో అతివేగంగా అభివృద్ధి చెందుతున్న తీర ప్రాంతం అక్రమాల పుట్టగా మారింది. అధికారులు ఉదాసీనతతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుసుకొస్తున్నాయి. కనీసం వ్యవసాయ భూమి నుంచి నిర్మాణ భూమిగా మార్చే (ల్యాండ్ కన్వర్షన్) చేయడం లేదు. ప్రధానంగా తీరప్రాంతం, జాతీయ రహదారుల వెంట పుట్టగొడుగుల్లా అక్రమ లే అవుట్లు పుట్టకొచ్చాయి. కొనుగోలుదారులకు సమస్య తెలియకపోవడంతో పెట్టబడులు పెట్టి ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. వీటికి కనీసం ఎటువంటి అనుమతి లేదన్న సంగతి అక్రమార్కులు చెప్పకపోవడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటూ బాధపడుతున్నారు. భూముల విలువలకు రెక్కలు రావడంతో పంట పొలాలు కాస్తా అక్రమ లేఔట్లతో ప్లాట్లుగా మారిపోయాయి. రియల్టర్లు జేబులు నింపుకొనేందుకు కనీస అనుమతులు కూడా తీసుకోకుండా పంట పొలాలను కొనుగోలు చేసి వాటిని ఇష్టానుసారంగా ప్లాట్లు వేసి ప్రజలకు అమ్మేసి నిబంధనలకు పాతర వేస్తున్నారు. తీరా అనుమతులు లేని ప్లాట్లు కొనుగోలు చేసి జనం మోసపోతుండగా ప్రభుత్వ ఆదాయానికి మాత్రం కోట్లాది రూపాయల్లో చిల్లు పడుతోంది. రెవెన్యూ, పంచాయతీ అధికారులకు చేతులు తడిపితే చాలు..! ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసినా పట్టించుకోవడంలేదు. చీరాల ప్రాంతంలో జనాభా సంఖ్య పెరుగుతుండటంతో పట్టణ విస్తీర్ణం కూడా పెరిగింది. దీంతో పంట పొలాలను కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. స్వర్ణ రోడ్డు, దండుబాట, కొత్తపేట, వాడరేవు రోడ్డు, ప్రసాద్‌నగర్, ఈపూరుపాలెం బైపాస్, రామాపురం బైపాస్, 216 ఒంగోలు జాతీయ రహదారి వెంబడి రోడ్డు ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ ఇప్పుడు ఇళ్ల ప్లాట్లుగా మారాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ అక్రమ ప్లాట్ల వ్యవహారం అడ్డగోలుగా జరుగుతోంది. అయితే పొలం నుంచి ఇళ్ల స్థలాలుగా భూమార్పిడి జరిగింది మినహా కనీసం పంచాయతీ అనుమతి కూడా లేదు. అలానే లేఔట్‌లకు అనుమతి కూడా జరగలేదు. ఇప్పటికే ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాంతంలో ప్లాట్లు కొందరికి అంటగట్టి సొమ్ము చేసుకున్నారు. రెవెన్యూ అధికారులకు కాసులు కొట్టడంతో క్షణాల్లో భూ మార్పిడి చేస్తున్నారు. కనీసం నివాస యోగ్యమైన ప్రాంతమా? సౌకర్యాలు ఉన్నాయో లేవో కూడా పరిశీలన చేయడం లేదు. చీరాల ప్రాంతంలో వేస్తున్న మూడొంతుల లేఔట్లు కనీస అనుమతి కూడా తీసుకోకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. అవగాహన లేని కొనుగోలుదారులు ప్లాట్లయితే కొనుగోలు చేస్తున్నారే కానీ ఆ తర్వాత మున్సిపాలిటీతో పాటు పంచాయతీల నుంచి అనుమతులు రాకపోవడంతో పాటు బ్యాంక్‌లు ఇళ్లు కట్టుకోవడానికి రుణ సౌకర్యం కూడా ఇవ్వడం లేదు. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

నిబంధనలకు నీళ్లు

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను కూడా రియల్టర్లు ఎగవేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట పొలాలను ప్లాట్లుగా మార్చి లేఔట్లు వేయాలంటే ఆ పొలం మార్కెట్ విలువలో కన్వర్షన్ ఫీజు పది శాతం ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తర్వాత విస్తీర్ణంలో పదో వంతు స్థలం పార్కులకు, 23 శాతం స్థలం రోడ్లు, ఇతర అవసరాలకు వదలాల్సి ఉంటుంది. మిగిలిన స్థలంలోనే ప్లాట్లు వేసుకొని విక్రయించుకొనే అవకాశం ఉంటుంది. లేఔట్‌కు కూడా ప్రభుత్వం తప్పని సరిగా అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఇందుకు రియల్టర్ ప్రభుత్వానికి సెక్యూరిటీ డిపాజిట్ కూడా కొంత చెల్లించాల్సి ఉంటుంది. అలానే మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఇన్ని అనుమతులు ఉంటేనే ప్లాట్లను రిజిస్ట్రేషన్‌కు రిజిస్ట్రార్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ చీరాల ప్రాంతంలోని పంట పొలాల్లో వేసిన ప్లాట్లకు ఎలాంటి అనుమతులు లేవు. పొలాన్ని ప్లాట్లుగా మార్చుకొనేందుకు ప్రభుత్వానికి ఎటువంటి ఫీజులు చెల్లించడం లేదు.

అంతా పెద్ద రియల్టర్ కనుసన్నల్లోనే..

చీరాల్లోనే పేరుగాంచిన బడా రియల్టర్ కనుసన్నల్లోనే అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. చీరాల్లో ఎవరు వెంచర్ వేయాలన్నా...ప్లాట్లు వేసి అమ్మాలన్నా...రాజకీయ పలుకుబడి ఉన్న ఈ కోటీశ్వరుడి ఆమోదం ఉండాల్సిందే. రియల్ ఎస్టేట్ సిండికేట్‌కు ఇతను డాన్‌గా వ్యవహరిస్తున్నాడనే ప్రచారం ఉంది. అటు అధికార పార్టీ ముఖ్యనేత అండదండలు పుష్కలంగా ఉండటం...ఇటు ఆ బడా రియల్టర్ పుత్ర రత్నాలు ముగ్గురు ఉండటంతో చీరాల రియల్ ఎస్టేట్‌ను శాసిస్తున్నారు. నియోజకవర్గ ముఖ్యనేత ఆమోదంతో పాటు, వేరే ప్రాంతానికి చెందిన ఓ ఎంపీ పేరు చెప్పుకుని చీరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కొత్త నిర్వచనంగా, డాన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇటీవలన రామాపురంలో వేసిన 20 ఎకరాల ప్లాట్లు, ముఖ్యనేత ఇంటి సమీపంలో ఉన్న ప్లాట్లు, ఇతర ప్రాంతాల్లో ఎవ్వరైనా ప్లాట్లు వేసినా ఇతను చెప్పిన రేటుకే కొనుగోలు చేయాలని హుకుం జారీ చేయడంతో మిగిలిన రియల్టర్లు మొత్తం ఇతని మాటను శాసనంగా పాటిస్తున్నారని ప్రచారం జోరుగా జరుగుతోంది.

> **అక్రమ లేఅవుట్ల రికార్డులు.. కన్వర్షన్‌లు పరిశీలిస్తున్నాం**
>
> చీరాల నియోజకవర్గంలో జరుగుతున్న ఈ అక్రమ లేఔట్లపై పూర్తిగా వివరాలు సేకరిస్తున్నా. చీరాల రూరల్, వేటపాలెం మండలంలో ఇబ్బడిముబ్బడిగా వేసిన వెంచర్లకు ఉన్న రికార్డులు, ల్యాండ్ కన్వర్షన్‌ల వివరాలు, తదితర అంశాలను పూర్తిగా పరిశీలిస్తున్నాం. అక్రమ లేఔట్లకు అనుమతులు ఉన్నాయో లేవో పరిశీలన చేస్తున్నా. ఇటీవల కొన్ని అక్రమ లే అవుట్లను స్వయంగా పరిశీలించా. అనుమతులు లేని లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయకండి. అన్నీ అనుమతులు ఉంటేనే కొనుగోలు చేయాలి. త్వరలోనే అనుమతులు లేకుండా ప్లాట్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.
>
> – టి.చంద్రశేఖర్ నాయుడు, ఆర్డీవో చీరాల

అన్నీ తెలిసినా అరకొర తనిఖీలే..

నియోజకవర్గంలో పంట పొలాలను నేరుగా ప్లాట్లు వేసి ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు. వందల ఎకరాల్లో అక్రమ లేవుట్లు వేస్తున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు అండగా నిలబడి రాజకీయ నాయకులకు మధ్యవర్తిత్వం చేస్తున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. టౌన్‌ప్లానింగ్ అధికారులు కానీ.. పంచాయతీ అధికారులు కానీ ఈ అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రియల్టర్లు ఇచ్చే కాసుల కోసం వీరు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారు. అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ లేఔట్లను వేసి ప్లాట్లను అమ్మేస్తున్నారు. కొనుగోలు చేసిన వారు మాత్రం నష్టపోతున్నారు. ప్రభుత్వ అనుమతి లేకపోతే బ్యాంక్‌లు రుణాలు ఇవ్వడం లేదు. మున్సిపాలిటీ కానీ, పంచాయతీ కానీ రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక వసతులు కల్పించలేదు.



వాడరేవు సమీపంలో పంట పొలాల్లో అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున ప్లాట్లు వేసిన దృశ్యం



216 బైపాస్ రోడ్డును ఆక్రమించి కొత్తగా వేసిన అనుమతులు లేని లే అవుట్



ఇటీవల అక్రమ లేఅవుట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర నాయుడు (ఫైల్)

క్లుప్తంగా

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి



అప్పా ఖుల్లా ఖాన్, బిస్మిల్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మార్టూరు: స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారితో పోరాడి ఉరికంభం ఎక్కి అసువులు బాసిన స్వాతంత్ర సమరయోధులు అప్పా ఖుల్లా ఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్‌కు గురువారం మార్టూరులో నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గన్నవరం సెంటర్లో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కమాలుద్దీన్ సమరయోధులు ఇద్దరి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు మహమ్మద్ బాష, సుజాత, అచ్యుతరామరాజు, కాజా మధు అల్లా బక్షు, బాష తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి ప్రభుత్వ వైద్యశాల తనిఖీ

అద్దంకి రూరల్: జిల్లా వైద్యాధికారి (డీసీహెచ్ఎస్) శేషకుమార్ గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. వైద్యుల పనితీరుతో పాటు అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్యశాలకు కొరతగా ఉన్న ఒక జనరల్ సర్జన్‌ను త్వరలో నియమిస్తున్నట్లు తెలిపారు. వైద్యశాలకు అవసరమైన డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతుల ఆందోళన

పర్చూరు(చినగంజాం): తుఫాన్ హెచ్చరికలతో నియోజకవర్గంలోని రైతులు బెంబేలెత్తుతున్నారు. గడచిన రెండు రోజులుగా వాతావరణం మేఘావృతమై చల్లగా ఉండటంతో ఏ క్షణంలో ఏమి జరుగుతుందో అని రైతులు భయాందోళన చెందుతున్నారు. పర్చూరు నియోజక వర్గంలోని మార్టూరు, పర్చూరు, చినగంజాం, ఇంకొల్లు, యద్దనపూడి, కారంచేడు మండలాలు సబ్ డివిజన్ పరిధిలోని రైతులు ఇప్పటికే పొగాకు, మిర్చి, పత్తి, మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుత పంటలు మంచి ఏపు దశలో ఉండగా వాటికి ఒక మోస్తరు వర్షం అవసరం ఉంది. అంత కంటే ఎక్కువ వర్షం నమోదైతే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. ఈ పాటికి కొన్ని ప్రాంతాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి. మరో నెల రోజుల్లో పొగాకు పంటకు సంబంధించి ఆకు కొట్టే కార్యక్రమాన్ని కూడా రైతులు ప్రారంభించనున్నారు. ఈ దశలో వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. దక్షిణ కోస్తా, కోస్తా ఆంధ్ర ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతుండటంతో రైతులు ఏమీ చేయాలో తెలియని పరిస్థితిలో దిగాలు చెందుతున్నారు.

ప్రతి ఇంటికీ సోలార్ వెలుగులు

అద్దంకి రూరల్: ప్రతి ఇంటిలో సోలార్ విద్యుత్ సదుపాయాన్ని తీసుకురావటమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు వెల్లడించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మస్తాన్‌రావు మాట్లాడుతూ విద్యుత్‌ను అవసమైనంత వరకే వినియోగించుకోవాలన్నారు. గృహాల్లో వాడే ప్రతి వస్తువు నాణ్యమైనదిగా ఉంటే విద్యుత్ వినియోగం తగ్గుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సోలార్ విద్యుత్ అందజేసేందుకు కొత్తపథకాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు.

చీరాల అర్బన్: ఇంధనం పొదుపు చేసి భావితరాలకు వెలుగునిద్దామంటూ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ ఈఈ కె.జాన్ థామస్ ఆధ్వర్యంలో స్థానిక వాడరేవు రోడ్డు నుంచి పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఇంధనం పొదుపు చేస్తే భావితరాలకు వెలుగునిచ్చిన వారమవుతామన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలన్నారు. విద్యుత్ డీఈఈ హరిప్రసాదరావు, ఏఈలు ఘననారాయణ, శ్యామ్‌కుమార్, భాస్కరరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

31 లోగా పంట నమోదు చేయించుకోండి

చినగంజాం: రబీలో వరి సాగు చేస్తున్న రైతులు ఈ నెల 31 వ తేదీలోగా పంట బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు తెలియజేశారు. పంటల బీమా చేయించుకొనుటకు కావాల్సిన క్రాప్‌సోన్ సర్టిఫికెట్లు తమ రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏ దగ్గర నుంచి పొంది దగ్గరలోని మీ సేవ కేంద్రం, సచివాలయం లేదా బ్యాంకులో నమోదు చేయించుకోవాల్సిందిగా తెలియజేశారు. రబీ సీజన్‌లో బ్యాంకు రుణం తీసుకొని శనగ, మినుము, పెసర, వరి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పండించే రైతులు ఈ నెల 31 వ తేదీ లోపు మీ రైతు సేవ కేంద్రంలో వీఏఏను సంప్రదించి క్రాప్ సోన్ సర్టిఫికెట్ తీసుకొని మీ బ్యాంక్ మేనేజర్‌కు సమర్పించి బీమా నమోదు చేయించుకోవాల్సిందిగా సూచించారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం మార్గశిర మాసం మఘ నక్షత్రం పంచమి తిధి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

స్టడీ మెటీరియల్ అందజేత



మెటీరియల్ పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అద్దంకి: ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు యూటీఎఫ్ 140 మందికి స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేసింది. దాతలు పరిమళా ఫౌండేషన్ బీవీ కృష్ణారెడ్డి, త్రివిక్రమ్ ఎంటర్‌ప్రైజెస్ తాత సురేశ్ అందజేశారు. హెచ్‌ఎం కె. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ పేరం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుంకర శ్రీదేవి, మండవ నాగేశ్వరరావు, నాని బేగం, సునీత, మాధవి, సింగమ్మ, పీడీ కృష్ణారావు, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు వీరాంజనేయులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లతో జీవనోపాధి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు

అద్దంకి: మహిళలకు కుట్టుమిషన్లతో జీవనోపాధి లభిస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ బంజారా హిల్స్, బీజీఆర్ మైన్స్.. ఇన్‌ఫ్రా లిమిటెడ్ సహకారంతో పదిమింది పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రోటరీ సెక్రటరీ చుండూరి మురళి సుధాకరరావు, చిన్న మురళీ కృష్ణ, డాక్టర్ దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, ఆళహరి హరిప్రసాద్, పసుపులేటి. ఆంజనేయులు, గాడేపల్లి దివాకరదత్తు పాల్గొన్నారు.

పరిశుభ్రత వచ్చే!



నిన్న: చెత్తకుప్పల వద్ద బైపాస్ రోడ్డులో పందులు స్వైరవిహారం (ఫైల్)



నేడు: బైపాస్ రోడ్డులో చెత్త కుప్పలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చీరాల టౌన్: నివాస ప్రాంతాలు, జనసంచారం అధికంగా ఉండే మార్గాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గురువారం 'సాక్షి'లో వచ్చిన 'సర్వం చెత్త మయం' అనే కథనానికి ఎంపీడీవో స్పందించారు. ఈపురుపాలెం బైపాస్ రోడ్డులో జనసంచారం అధికంగా ఉండే ప్రాంతంలో చెత్తకుప్పలు పేరుకుపోయి పందుల స్వైర విహారం చేస్తుండటంపై గురువారం సాక్షి కథనంగా ప్రచురించింది. దీంతో ఎంపీడీవో చెత్తకుండీలను తొలగించేసి ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. ప్రజాసమస్యలను సత్వరంగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తున్న సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మురళీబాపూజీ, సిబ్బంది బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల వివాదంపై నేడు విచారణ

వేటపాలెం: పుల్లరిపాలెం పంచాయతీ పరిధిలోని సాయినగర్ (ఎస్టీకాలనీ)లో భూగర్భ జలాల వివాదం పై మండల లెవెల్ కమిటీ విచారణ చేస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి ఫిర్యాదు దారులకు గురువారం నోటీసులు అందజేశారు. సాయినగర్ యానాది కాలనీ దగ్గరలో రొయ్యల చెరువులు ఉండటంతో భూగర్భ జలాలు కలుషిత మవుతున్నాయని, కాలనీకి దగ్గరలో ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఫిర్యాదుదారులు ఆరోపించారు. ఈమేరకు కాలనీకి చెందిన ఇండ్ల స్వాతి జాయతీ ఎస్టీ కమిషనర్‌కి ఫిర్యాదు చేసింది. దీనిపై గతంలో ఆర్‌డీఓ, తహసీల్దార్ కాలనీలో విచారణ చేపట్టారు. అయితే ఈ విచారణలో రాజకీయ నాయకులు పాల్గొని బెదిరించారంటూ.. పిటిషనర్ తిరిగి జాతీయ ఎస్టీ కమిషనర్‌కి తిరిగి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన ఎస్టీ కమిషనర్ మండల లెవెల్ కమిటీని విచారణ నిమిత్తం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ శుక్రవారం ఉదయం 10 గంటలకు సాయినగర్ ఎస్టీ కాలనీలో ఫిర్యాదు దారులను విచారించనుంది.

పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులే కీలకం



రెండో విడత బ్యాచ్‌కు శిక్షణ అందిస్తున్న అధికారులు

చీరాల టౌన్: మౌలిక వసతులు కల్పించడంతో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో రెండో విడతగా సచివాలయాల అన్ని శాఖల ఉద్యోగులకు, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఐసీడీఎస్ సిబ్బందికి జరుగుతున్న శిక్షణలో గురువారం పలు అంశాలపై శిక్షణ అందించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గ్రామంగా రూపాంతరం చెందాలంటే ప్రజలంతా స్వచ్ఛతకు, శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. గ్రామ ప్రజలు స్వయం సమృద్ధితో పాటు మౌలిక వసతులు కల్పించి, నీటి సమృద్ధి కలిగిన గ్రామంగా, బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. ప్రతిఒక్కరికి ప్రభుత్వాలు అందించే ప్రతి పథకాలను అందించి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత, విధులను కార్యదర్శులు, సిబ్బంది సమర్థవంతంగా నిర్వహిస్తే సత్ఫలితాలు సాధిస్తామని సూచనలు చేశారు. ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధుసూధన్, పంచాయతీల సెక్రటరీలు, వీఆర్వోలున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



పంగులూరు వెలుగు కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

జె.పంగులూరు: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం సెమీ క్రిస్మమస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంపీడీఓ కె. స్వరూపరాణి, ఏపీఎం జ్యోతిప్రసాద్ సెమీ కేకును కట్‌చేశారు. పాస్టర్ పి. చంద్రపాల్ క్రీస్తు బోధనలను తెలియజేశారు. క్రీస్తు జననం ఈ లోకానికి మేలు కలుగు చేస్తుందని తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈవో వీరాంజనేయులు, ఏపీఓ సంతోషమ్మ, స్త్రీనిధి మేనేజర్ టి. శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వేజెండ్ల మాధవి, పంచాయతీ రాజ్ ఏఈ గడ్డం హనుమంతురావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సీసీలు సాల్మన్, చంద్రశేఖర్, సురేష్ తెలుగు దేశం పార్టీ నాయకులు మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, మురకొండ సుబ్బారావు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, రాంబాబు, గుర్రం ఆదిశేకర్, దాసరి హనుమంతురావు, గుదిబండ్ల ఆదిరెడ్డి, బాచిన చౌదరి బాబు మండల వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

రామాలయాల్లో ధనుర్మాస పూజలు

బల్లికురవ: రామాలయాల్లో ధనుర్మాసం సందర్భంగా ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచే విశిష్ట పూజలతో పాటు తిరుప్పావై నిర్వహిస్తున్నారు. కొండాయపాలెం, చెన్నుపల్లి, కొప్పరపాలెం, మల్లాయపాలెం, కొత్తపాలెం వైదన, కొత్తూరు, కూకట్లపల్లి, కొమ్మినేని వారి పాలెం గ్రామాల్లో జనవరి 13 వరకు ధనుర్మాస పూజలు చేపడుతున్నట్లు అర్చకులు, ఆలయ ధర్మకర్తలు గురువారం తెలిపారు. జనవరి 10 ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 13న గోదా కల్యాణంతో ధనుర్మాజ పూజలు ముగుస్తాయని అర్చకులు వి. మారుతి నరేష్, అనిల్ కుమార్, గోవర్ధనాచార్యలు, శోభనాచార్యలు సుబ్బాచార్యులు తెలిపారు.

బైక్ ఢీ.. వాకర్‌కు తీవ్ర గాయాలు



సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: ఉదయాన్నే వాకింగ్ చేస్తున్న వ్యక్తిని మోటార్ బైక్ ఢీ కొట్టడంతో తీవ గ్రాయాల పాలయ్యాడు. పాట్టిసుబ్బయ్యపాలెం వెళ్లే రోడ్డు మార్గంలో బీబీహెచ్ డిగ్రీ కళాశాల దగ్గరలో సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన బాణాల లక్ష్మీనారాయణ ఇద్దరు మిత్రులతో కలిసి ప్రతి రోజూ ఉదయం వేళ పాట్టిసుబ్బపాలెం రోడ్డులో వాకింగ్‌కి చేస్తుంటారు. అయితే రోజూ మాదిరిగా స్నేహితులతో కలిసి వాకింగ్ చేస్తున్న సమయంలో వేనుక నుంచి వేంగంగా వచ్చిన మోటార్ బైక్ వాకింగ్ చేస్తున్న వారిని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో లక్ష్మీనారాయణ రోడ్డు పై పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 108లో చీరాల వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అయితే తలకు బలమైన గాయాలవ్వడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు దారుణం



అద్దంకి అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



మేదరమెట్లలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



చీరాల: అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మేదరమెట్ల: పార్లమెంటులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ప్రజాసంఘాల నాయకులు మేదరమెట్లలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రత్నను అవమాన పరచడం హేయమైన చర్య అన్నారు. సీపీఎం నాయకులు మోంద్రు ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకుడు జజ్జర ఆనందరావు, బీసీ సంఘం నాయకుడు గోలి రమణబాబు, జ్యోతి రమేష్‌బాబు, పఠాన్ సర్దార్‌ఖాన్, కాట్రా కార్తీక్, చిన్నా పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

చీరాల రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షాను తక్షణమే పదవినుండి తొలగించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ వద్దగల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. మార్పు గ్రగోరి, కంచర్ల చిట్టిబాబు, గోసాల సుధాకర్, కట్టా ఆనంద్, వాసిమళ్ల వాసు, శ్రీను, మల్లెల రాజశేఖర్, కనపర్తి బజ్జిబాబు, బొమ్మతోటి సామ్యూల్, కోటి సుధాకర్, తలకాయల సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అంబేడ్కర్‌ను ఆయన రాజ్యాంగాన్ని అవమాన పరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను కేంద్ర ప్రభుత్వ మండలి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవార పార్లమెంటులో75 సంవత్సరాల స్వాతంత్రం అనే అంశంపై చర్చ నిర్వహిస్తూ అంబేడ్కర్ గారి పేరును పదే పదే ఉచ్ఛరిస్తున్నారని.. అదేదో దేవుని పేరును ఉచ్ఛరిస్తే పుణ్యమైన వస్తుందని బహిరంగా చట్ట సభల్లో వ్యాఖ్యానించటం హోం మంత్రికి రాజ్యాంగాన్ని అవమానించడమేనన్నారు. ఎం. జోసఫ్, పి.తిరుపతి, పి. ఆదాం, రావులపల్లి కోటేశ్వరరావు, కె. హనుమంతరావు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.